ప్రజాశక్తి
శనివారం 21 జూన్ 2025





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

రెవెన్యూ శాఖలో నూతన సంస్కరణలు

- కలెక్టర్ పి.రంజిత్ బాషా - ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రెవెన్యూ శాఖలో నూతన సంస్కరణలు అమలు కాబోతున్నాయని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా రెవెన్యూ శాఖ ఉద్యోగులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రెవెన్యూ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సర్వీస్ అనగానే గర్వించదగిన అనుభూతి వస్తుందన్నారు. రెవెన్యూ శాఖలో ఏ స్థాయిలో ఉన్న ఉద్యోగి అయినా ఈ శాఖలో పని చేస్తున్నందుకు గర్వపడతారన్నారు. రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన తర్వాతే మిగిలిన శాఖలు రావడం వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు సేవలందించడంలో రెవెన్యూ శాఖ ది కీలకమైన పాత్రని కలెక్టర్ పేర్కొన్నారు. లా అండ్ ఆర్డర్, విపత్తు నిర్వహణ, ఫైల్స్ నిర్వహణ తదితర పబ్లిక్‌కి సంబంధించి ఏ సర్వీసు అయినా మొట్టమొదటిగా ఉండే శాఖ రెవెన్యూ శాఖ అన్నారు. రెవెన్యూ శాఖలో కాలక్రమేణ అనేక మార్పులు, సంస్కరణలు వచ్చాయన్నారు. ఈ సంస్కరణల్లో తాను పాలుపంచుకున్నానని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు.. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ రెవెన్యూ శాఖ అతి ప్రాచీనమైన శాఖ అన్నారు.. దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల విభాగాలు ఈ శాఖ నుండి ఉద్భవించినవే అని, ప్రజలతో మమేకమైనది రెవెన్యూ శాఖ అన్నారు. అత్యధికంగా ప్రజలకు కావలసిన పనులు, వారి సమస్యల బాధ్యతలు మోయాల్సిన శాఖ రెవెన్యూ శాఖ అన్నారు. ఈ శాఖలో ప్రలోభాలు, వత్తిడి అధికంగా ఉంటాయని, వాటిని అధిగమించి పనిచేయాలని సూచించారు. అనంతరం విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు శశిదేవి, క్రిస్టఫర్, జయన్న, విజయుడు, హుస్సేన్, రమణ, ఆదినారాయణ, రామన్న, ఎల్ల రాముడు తదితరులను రెవెన్యూ సంఘం తరపున కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఘనంగా సన్మానించారు. అంతకముందు కలెక్టరేట్ ప్రాంగణంలోని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ భవనంలో రెవెన్యూ డే సందర్భంగా రెవిన్యూ ఉద్యోగుల రక్తదాన కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందచేశారు. సమావేశంలో ఏపి రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగరాజు, వెంకట్ రాజు, కోశాధికారి లోకేశ్ రెడ్డి హౌసింగ్ పిడి చిరంజీవి, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, అజయ్ కుమార్ , కొండయ్య, నాగ ప్రసన్న, సునీతా బాయ్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివ రాముడు, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ భూమి కబ్జా

- 1.50 ఎకరాలకు పైగా భూమి అన్యాక్రాంతం
- నిర్మాణ పనులు చేపట్టిన కబ్జాదారులు
- పోలీస్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు
- భూమి అన్నక్రాంతకం కాకుండా చర్యలు
- వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రూ.కోట్లు విలువ చేసే రాయలసీమ యూనివర్సిటీ భూమిని ఆక్రమణదారులు కబ్జా చేసేశారు. ఈ కబ్జా చేసిన భూముల్లో యథేచ్ఛగా భవన నిర్మాణ పనులను కూడా చేపడుతున్నారు. వర్సిటీ భూములు ఆక్రమణకు గురి కావడంతో విద్యార్థులు మండిపడుతున్నారు. రాయలసీమ యూనివర్సిటీకి కర్నూలు రూరల్ మండలం పరిధిలోని బి తాండ్రపాడు, పసుపుల గ్రామాల పరిధిలో 110 ఎకరాలకు పైగా భూమి ఉంది. వర్సిటీకి చెందిన భూమిలో అనేకమంది కబ్జాదారులు పెద్ద ఎత్తున భూమిని కబ్జా చేసుకుంటూ వెళ్ళిపోయారు. వర్సిటీ భూమి కబ్జాకు గురవుతున్నప్పటికీ అప్పటి ఉన్నతాధికారులు నిలువరించలేకపోయారు. ప్రస్తుతం పసుపుల గ్రామం పరిధిలో ఉన్నటువంటి సర్వేనెంబర్ 9/3-1 లో గల1.50 ఎకరం భూమిని యథేచగా కబ్జాకు గురైంది. పశుపుల రహదారికి వెళ్లే పక్కనే ఉన్నటువంటి ఈ భూమి విలువ ప్రస్తుతం ఎకారాకు కోట్లల్లోనే పలుకుతుంది. ఓ మాజీ మంత్రి కుటుంబానికి చెందిన వ్యక్తులు ఈ భూమిని అన్నక్రాంతం చేసుకున్నట్లు సమాచారం. ఈ భూమిపై నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి తమకు సంబంధించిన భూమిగా నిర్ధారించే విధంగా ఆక్రమణ చేసిన వ్యక్తులు వ్యవహరించారు. ఈ భూకబ్జా వ్యవహారంపైన వర్సిటీ ఉన్నతాధికారులు పోలీసు రెవెన్యూ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను నిలిపివేయాలని విన్నవించారు. అయినప్పటికీ యథేచ్ఛగా ఈ భూముల్లో నిర్మాణ పనులను ఆక్రమణదారులు చేపడుతున్నారు. వర్సిటీ భూములు ఇంత పెద్ద మొత్తంలో ఆక్రమణకు గురి కావడం పట్ల విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.



నిర్మాణాలు చేపడుతున్న కబ్జాదారులు

వర్సిటీ భూములను అన్యాక్రాంతం కానివ్వం

- వి.వెంకట బసవరావ్ , వైస్ ఛాన్సలర్



వర్సిటీకి సంబంధించిన భూమి అన్యాక్రాంతం కావడం వాస్తవమే. ఈ భూమిని అన్నక్రాంతం చేసిన వ్యక్తుల పైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశాం. వర్సిటీ భూములన్నిటిని సర్వే చేయించాలని కూడా జిల్లా కలెక్టర్‌కు విన్నవించాం.

వర్సిటీ భూములను కాపాడాలి

- రామకృష్ణ కన్వీనర్ రాయలసీమ వర్సిటీ, ఎస్ఎఫ్ఐ



రాయలసీమ వర్సిటీకి చెందిన భూములు పెద్ద ఎత్తున కబ్జాకు గురవుతున్నాయి. ఇప్పటికే పెద్ద మొత్తం భూమిలో కబ్జాదారులు నిర్మాణాలను కూడా చేపట్టారు. ఇప్పుడు కూడా కబ్జా చేసిన భూముల్లో నిర్మాణ పనులను కబ్జాదారులు పనులను చేపడుతూనే వెంటనే ఉన్నత విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకొని వర్సిటీ భూములను కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి.

మంత్రివర్గ నిర్ణయాన్ని ఉపసంహరించాలి

- కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇటీవల రాష్ట్ర మంత్రి మండలి కార్మికుల పనిగంటలకు సంబంధించిన తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాలు సిఐటియు, ఎఐటియుసి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కర్నూలు నగర కార్యదర్శులు విజయ్, వెంకటేష్ అధ్యక్షతన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి అంజిబాబు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్పలు పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొని వచ్చి కార్మిక హక్కులను కాల రాసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి మేరకే ఈ లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. క్యాబినెట్ సమావేశంలో ఎనిమిది గంటల పని విధానాన్ని 10 గంటలు 12 గంటలుగా మార్పు చేసిందన్నారు. కార్మికుల కడుపు కొట్టేందుకు కార్పొరేట్ల కడుపు నింపేందుకు కుట్ర చేస్తుందని తక్షణమే పెంచిన పని గంటలను ఉపసంహరించుకొవాలన్నారు. కార్మికుల రక్తతర్పణతో, త్యాగాలతో వచ్చినటువంటి 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేరళ, పశ్చిమబెంగాల్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో అమలు చేయమని తేల్చి చెబితే చంద్రబాబు నాయుడు అమలుకు పూనుకున్నారన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు, స్కీం వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా రికార్డుల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా చూపించి కార్మికుల కడుపు కొడుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టిసి జిల్లా అధ్యక్షులు బతకన్న ప్రభుదాసు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి సురేష్ నాయక్ , ఎఐటియుసి నగర కార్యదర్శి జి చంద్రశేఖర్, నగర్ ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు, నల్లన్న, నాగరాజు, రాము, జయరాంరెడ్డి, పురుషోత్తం మాణిక్యం సాలు సిఐటియు నగర నాయకులు సాయిబాబా గోపాల్ కష్ణ కుమార్ సవరప్ప తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ : కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తే సహించేది లేదని సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు రవిచంద్ర మండిపడ్డారు. పత్తికొండ ఈశ్వర్ రెడ్డి భవనం నుండి సిఐటియు మండల కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు పని భారం తగ్గించాలంటూ నినాదాలు చేస్తూ ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు సిఐటియు నాయకులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సిఐటియు నాయకులు రవిచంద్ర, సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడారు.

మద్దికేర : మద్దికేర మండల సిఐటియు ఆధ్వర్యంలో పెంచిన పని గంటలను తగ్గించాలని చంద్రబాబు కూటమి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు. సిఐటియు మండల కార్యదర్శి బురుజుల రాముడు, సిపిఎం మండల శాఖ కార్యదర్శి కడవల రవి కుమార్ మాట్లాడారు. అంగన్వాడి కార్యకర్తలు రంగమ్మ, పద్మ, హమాలీ యూనియన్ శివాజీ, శివ, గోవర్ధన్, రాముడు, విఆర్‌ఎలు అజయ్, సుంకన్న, మస్తాన్, కోదండ, ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, రాజేష్, హరి లు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: మే డే స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని కోరుతూ గూడూరులో సిఐటియు ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లో సిఐటియు నాయకులు దానం ఉన్న అధ్యక్షతన కార్మికులతో ధర్నా చేశారు. ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్ మాట్లాడారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఏడాది పాలనలో ఒరిగింది శూన్యం

- పెండింగ్ ప్రాజెక్టులకు రూ.10 వేల కోట్లు కేటాయించాలి
- ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- స్మార్ట్ మీటర్లపై ప్రభుత్వ వైఖరేంటి?
- కూటమి, వైసిపి తోడుదొంగలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్
- దారి తప్పుతున్న టిడిపి కూటమి ఏడాది పాలన పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో జిల్లాకు ఒరిగింది శూన్యమని, కర్నూలు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు రూ.10 వేల కోట్లు కేటాయించి తక్షణమే పూర్తి చేసి సాగు, తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. ఏడాది పాలనలో హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. శుక్రవారం కర్నూలు సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అధికారంలోకి రావడం కోసం ఆదాయంతో నిమిత్తం లేకుండా కేవలం ప్రజలను మభ్యపెట్టడం కోసం 143 వాగ్దానాలు చేశారన్నారు. ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం కింద రూ.15వేలు ఇస్తామని చెప్పారని, సగం మందికి ఇంకా రాలేదని, వచ్చిన వారికి కూడా రూ.13వేలే ఇచ్చారని తెలిపారు. ఆ పథకం కోసం 15వ ఆర్థిక సంఘం నిధులను వాడారని, పంచాయతీలకు నిధులు లేకుండా చేశారని అన్నారు. కేంద్రం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు ఇచ్చిన నిధులు తప్ప రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అభివృద్ధికి ఒక్క రుపాయి కూడా ఇవ్వలేదని, ఏదైనా ఇచ్చినట్లు టిడిపి నాయకులు చూపిస్తే తమ ప్రకటనను వెనక్కి తీసుకుంటామని చెప్పారు. జిల్లాలోని ప్రాజెక్టులకు ఒక్క రుపాయి కూడా కేటాయించలేదని, వేదవతి, గుండ్రేవుల వంటి వాటి ప్రస్తావన లేదని, హంద్రీనీవా నత్తనడకన సాగుతోందని తెలిపారు. జిల్లా ప్రాజెక్టులను పట్టించుకోకుండా బనకచర్లతో రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని అంటున్నారన్నారు. గతంలో పట్టిసీమతో రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని చెప్పారని, ఒక్క ఎకరాకైనా నీళ్లు అందాయా అని ప్రశ్నించారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే సస్యశ్యామలం అవుతుందని, అందుకు రూ.80వేల కోట్లు అవసరం లేదని, రూ.10వేల కోట్లు ఇస్తే చాలని చెప్పారు. బనకచర్లతో వచ్చే నీళ్లు జిల్లా ప్రాజెక్టుల నుంచే తీసుకోవచ్చని విశ్రాంత ఇంజనీర్ సుబ్బరాయుడు చెబుతున్నారన్నారు. పోలవరమే పూర్తి కాకుండా బనకచర్ల ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. బనకచర్ల ప్రజల ఆలోచనను మళ్లించడానికి తప్ప మరొకటి కాదన్నారు. పొగాకు కొనని పరిస్థితి ఉందని, టిడిపి నాయకులు ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఈ ప్రభుత్వంలో ఏ సమస్యా పరిష్కారం కావడం లేదన్నారు. అధికారంలోకి రాకముందు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చారని, ఇప్పుడు బలవంతంగా పెట్టిస్తున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ప్రభుత్వ వైఖరి ఏంటని ప్రశ్నించారు. ప్రజలపై భారాలు వేయడం తప్ప మేలు జరిగిందేమీ లేదన్నారు. గతంలోని వైసిపి, ప్రస్తుత కూటమి తోడుదొంగలని ఎద్దేవా చేశారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు రూ.10 వేల కోట్లు కేటాయించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. 8 నెలలుగా ఉపాధి హామీ బిల్లులు రావడం లేదని, జిల్లాలో రూ.100 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిఎస్సీలో సగం పోస్టులు కోత పెట్టారన్నారు. సంవత్సరంలోనే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, అది రాకుండా ఉండాలంటే ప్రజలకు మేలు చేయాలని లేకుంటే జగన్‌కు పట్టిన గతే చంద్రబాబుకూ పడుతుందని చెప్పారు. ప్రజలపై భారాలు వేయకుండా చూసుకోవాలని, జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల మాట్లాడుతూ వైసిపిపై నాలుగేళ్లకు వ్యతిరేకత వస్తే కూటమిపై ఏడాదికే వచ్చిందన్నారు. మహిళలకు చెప్పిన నెలకు రూ.1500, ఉచిత బస్సు ఇంకా అమలు కావడం లేదన్నారు. ఈ ప్రభుత్వంలో వైన్ షాపులు బార్లలా మారిపోయాయని, బెల్టు షాపులు పెరిగిపోయాయని, ఆ ప్రాంతాల్లో మహిళలు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మద్యం డబ్బులతో ప్రభుత్వాన్ని నడపాలనుకోవడం మంచిది కాదన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని, మహిళలపై హింసను అరికట్టాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు దారి తప్పుతున్న టిడిపి కూటమి ఏడాది పాలన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, కెవి నారాయణ, టి.రాముడు, ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.



కూటమి ఏడాది పాలన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఎస్.రవీంద్రబాబు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

-యోగ దినోత్సవంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ప్రతిరోజు యోగా ఆసనాలు వేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం ఆయన ఖానా ఖజానా వద్ద స్ట్రీట్ యోగలో పాల్గొని ఆసనాలు చేశారు. ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని మెప్మా ఆర్‌పిలతో సమావేశం నిర్వహించారు.కమిషనర్ మాట్లాడుతూ.. మానవుడి ఆరోగ్యానికి సంబంధించి యోగమన దేశ వారసత్వమని, దీనిని ప్రజలు క్రమం తప్పకుండా ప్రతిరోజు ఆసనాలు వేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. గడిచిన నెల రోజులుగా యోగ మాసోత్సవంలో భాగంగా అనేక చైతన్యపరమైన కార్యక్రమాలను నిర్వహించామని, ప్రతి సచివాలయ పరిధిలో ఉచిత యోగసనాల శిక్షణ ఇచ్చామన్నారు. 2.50 లక్షలకు పైగా ప్రజలు యోగ శిక్షణకు నమోదు చేసుకోగా, మూడు దశల్లో మూడు రోజులపాటు ఉచిత శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి సచివాలయాల పరిధిలో యోగ డే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మేనేజర్ చిన్న రాముడు, మెప్మా పిడి వెంకట నాగశివలీల, యోగభ్యాసకులు అవినాష్, లలిత కళా సమితి అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జెండావిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహా సభలను పురస్కరించుకొని కర్నూలు నగరంలో పలుచోట్ల ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కమిటీ ఆధ్వర్యంలో గర్ల్స్ కన్వీనర్ కె. సంయుక్త జండావిష్కరణ చేశారు.. అనంతరం సంయుక్త మాట్లాడుతూ విద్యను ప్రైవేటీకరణ కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఎనలేని కృషి చేస్తుందని పేర్కొన్నారు. బాలికల విభాగం కమిటీ సభ్యులు ఊర్మిళ , రజిని తదితరులు పాల్గొన్నారు

ఆటో కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

ఆటోయూనియన్ నగర 3వ మహాసభలో పిఎస్ రాధాకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా రవాణా రంగ విధానాలకు నిరసనగా జులై 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం కార్మిక కర్షక భవన్ సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ న్యూ సిటీ నగర మూడవ మహాసభ ఆటో యూనియన్ అధ్యక్షులు ఎస్.హుసేన్‌వలి అధ్యక్షతన నిర్వహించారు. మహాసభ ప్రారంభానికి ముందు గత మూడు సంవత్సరాల కాలంలో మరణించిన సిఐటియు ప్రముఖ నాయకులకు డ్రైవర్లకు సంతాపం తెలిపారు. అనంతరం న్యూ సిటీ మూడవ నగర మహాసభకు ముఖ్యఅతిథిగా వచ్చిన సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ సిఐటియు న్యూ సిటీ అధ్యక్షులు ఆర్. నరసింహులు మాట్లాడుతూ ఆటో కార్మికుల కోసం నిరంతరం పనిచేసే సంఘం సిఐటియు అని సంఘ విస్తరణకు బలోపేతానికి డ్రైవర్ల అందరూ పెద్ద సంఖ్యలో కృషి చేయాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ జీవోలు సెక్షన్ల రూపంలో డ్రైవర్ల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు డ్రైవర్లకు వర్తించకుండా రవాణా రంగంపై ముక్కు పిండి వసూలు చేయడమే ప్రభుత్వ విధానంగా ఉందన్నారు. ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్లను పూర్తిగా వ్యతిరేకించిన ప్రభుత్వం అదే పనిగా జిల్లాల వ్యాప్తంగా టెస్టింగ్ సెంటర్లను ఏర్పాటుచేసి వాహన యజమానులను డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేస్తుందని తెలిపారు. కార్మికులకు అనుకూలంగా ఉన్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్లుగా విభజించిందన్నారు. వీటివల్ల కార్మికులు కట్టు బానిసలుగా యాజమాన్యాలు చూస్తాయన్నారు. కార్మిక హక్కులను కాల రాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలోడ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్, న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి బి. రాధాకృష్ణ మాట్లాడుతూ వాహన మిత్ర రూ.15 వేల ఇవ్వాలని , ఆటో డ్రైవర్లకు పిఎఫ్ ఇఎస్ఐ ఉచిత ప్రమాద బీమా ఇవ్వాలన్నారు. ఎటిఎస్ సెంటర్ల రద్దు, డ్రైవింగ్ టెస్ట్, సెన్సార్ సిస్టం రద్దు చేయాలన్నారు. జీవో నెంబర్ 21, భారత న్యాయ సహిత 106 సెక్షన్ రద్దు, ప్రభుత్వమే ఆటో స్టాండ్ నిర్మించాలని మౌలిక సదుపాయాలు కల్పించాలని తీర్మాల ద్వారా రానున్న కాలంలో ప్రభుత్వాలపై పోరాటాలు నిర్వహిస్తామని సిఐటియు చేసే పోరాటాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



ఆటోయూనియన్ నగర 3వ మహాసభలో మాట్లాడుతున్న పిఎస్ రాధాకృష్ణ



నూతన కార్యకవర్గం ఎన్నిక

అనంతరం నగర మహాసభ నూతన కమిటీని ఎన్నుకుంది. కమిటీ గౌరవాధ్యక్షులుగా కె. ప్రభాకర్, అధ్యక్షులుగా ఎస్ హుస్సేన్ వలి, ఉపాధ్యక్షులుగాఎస్. మాలిక్‌బాష, రాజశేఖర్, నాగరాజు, భాస్కర్, శీను, రాము, శీను, ప్రధాన కార్యదర్శిగా బి. రాధాకృష్ణ సహాయ కార్యదర్శులుగా షంషీర్‌బాష, మల్లీ, పి.నబి, సుబ్బన్న (ట్రాలీ ఆటో) రాజశేఖర్, మధు, కమిటీ సభ్యులుగా శంకర్ నాగరాజు, అయ్యన్న, మధు, శివకృష్ణ, పెద్ద కరుణ, మధు, జయన్న, మౌలాలి ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నగర నాయకులు వెంకట్, శికామణి, దానం అయ్య, స్వామి, న్యూ సిటీ పరిధిలోని అన్ని అడ్డాల నుంచి వచ్చిన వందలాది మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

యోగాలో వైద్యులు, సిబ్బంది పాల్గొనాలి

డిఎంహెచ్ఒ డాక్టర్ పి. శాంతికళ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వైద్యులు , సిబ్బంది తప్పక పాల్గొనాలని జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. శాంతికళ ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ మీ సమీపంలో నిర్వహించే యోగా కార్య క్రమంలో పాల్గొనాలని అన్నారు. వైద్యాధికారులు మండలస్థాయిలో, ఎఎల్ హెచ్ పిలు, ఎఎన్ఎం , ఆశా కార్యకర్తలు , సబ్ సెంటర్ , గ్రామ స్థాయిలో నిర్వహించే యోగా దినోత్సవంలో ఉదయం 6.15 గం లకు తప్పక పాల్గొనాలని ఆదేశించారు. తదుపరి జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి ప్రభుత్వ , ప్రైవేటు నర్సింగ్ కళాశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి నర్సింగ్ విద్యార్థులు కూడా వారికి సమీపంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. నర్సింగ్ కళాశాలలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించారు.



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ



క్రీడల సాధనను ప్రోత్సహించాలి

-బివిఆర్ హాస్పిటల్ అధినేత సి వాసు రెడ్డి , నగరూరు శమంతకమణి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

క్రీడల సాధనను ప్రోత్సహించాలని విఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత సి.వాసు రెడ్డి అన్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అవుట్డోర్ స్టేడియంలో శుక్రవారం ఉదయం జరిగిన తైక్వాండో పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోటీలలో క్రీడాకారులు పతకాలు సాధించాలని అన్నారు. భవిష్యత్తులో టైక్వాండో పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు తన వంతు ఆర్థిక సహాయ అందజేస్తామని అన్నారు. నగురూరు సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు, మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్.శమంతకమణి మాట్లాడుతూ క్రీడలకు స్పోర్ట్స్ కోట 3 శాతం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సర్వోత్తమ్, ఒలంపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, హాకీ సుధీర్, హర్షవర్ధన్, వేణుగోపాల్, దాదాబాష, జూడో కోచ్ కెఎండి షకీల్, టి అజయ్, టి.తేజ, రోహిత్, హుస్సేన్, తైక్వాండో కర్నూలు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాలుగు గడ్డివాములు దగ్ధం

- రూ 3 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి- సి బెళగల్



సి బెళగల్ మండలం ముడుమాలలో రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతులు పెద్ద సుంకన్న, నడిపి సుంకన్న లు మూగ జీవాల పోషణ నిమిత్తం చెరో రెండు గడ్డివాములు సిద్ధం చేసుకొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం వేళ పెద్దగా మంటలు వ్యాపించాయి. ఇరుగుపొరుగు రైతులు, ప్రజలు చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా విఫలమయ్యారు. దీంతో ఆ గడ్డి వాములు కల్లేదుటే కాలి బూడిద కావడంతో బాధిత రైతులు కన్నీళ్లు పెట్టుకొన్నారు. సి బెళగల్ పోలీసులు తగు విచారణ చేసి అనుమానా స్పద కింద కేసు నమోదు చేశారు. దీంతో ఆ రైతులకు నష్టం రూ 3 లక్షలు వరకు జరిగిందని రెవిన్యూ అధికారులు అంచనా వేశారు.

ఉరుకుందలో వేలం పాటలు

- భారీగా పెరిగిన ఆదాయం

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలో శ్రీలక్ష్మీనర సింహ ఈరన్న స్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు స్వామివారికి సమర్పించే టెంకాయలను అమ్ముకోవడానికి విశాఖ జిల్లా ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వేలంపాటలు శుక్రవారం నిర్వహించారు. షీల్డ్ టెండర్, ఆన్‌లైన్ టెండర్లను పాటదారుల నుంచి ఆహ్వానించారు. వేలం పాటల ద్వారా గతేడాది కంటే దేవాలయానికి రూ.48,06,227 ఆదాయం పెరిగింది. ఈ వేలం పాటలో కొబ్బరికాయలను సరఫరా చేసే విక్రయించడానికి కోసినికి చెందిన ప్రభుదేవా రూ.56,43,111లకు షీల్డ్ టెండర్ ద్వారా దక్కించుకున్నారు. అర కొబ్బరి చిప్పలను పోగు చేసుకునేందుకు నిర్వహించిన వేలం పాటలో కోసిగి గ్రామానికి చెందిన ముత్యన్న రూ.60,13,116కు దక్కించుకున్నారు. మొత్తంగా ఈ ఏడాది రూ.48 లక్షలు ఆదాయం పెరిగింది. నిత్యాన్నదానానికి సంవత్సరం పాటు కూరగాయలు సరఫరా చేయడానికి మార్కెట్ ధర కంటే రూపాయి తక్కువకు, కూరలకు 50 పైసలు తక్కువకు సరఫరా చేయడానికి నరసింహులు వేలం పాట దక్కించుకున్నారు. శ్రావణమాసంలో దేవాలయ పరిసరాల్లో పారిశుద్య పనులకు రూ.25 వేలకు వీరేష్ షీల్డ్ టెండర్ వేశారు. పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, కుమార్, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ఉప ప్రధానార్చకులు మహదేవ స్వామి పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు

దళితులకు ఎమ్మెల్యే క్షమాపణ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి దళితులకు క్షమాపణ చెప్పారు. ఈనెల 16న మండలంలోని ఢణాపురం గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో దళిత సర్పంచిపై వివక్ష చూపారన్న విషయంపై దళిత, ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పార్థసారథి క్షమాపణలు చెప్పారు. ఈనెల 16న మండలంలోని ఢణాపురం గ్రామంలో 'ప్రజల వద్దకు ఎమ్మెల్యే' కార్యక్రమం కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే పార్థసారథి నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఉన్న అరుగుపై గ్రామసభ నిర్వహించారు. సర్పంచి చంద్రశేఖర్‌ను పిలవకుండా 'ఎస్సీ' అని సంబోధిస్తూ కులం పేరుతో వివక్షత చూపారని సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ఘటన పట్ల ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఎంఆర్‌పిఎస్ నాయకుల సమక్షంలో మాట్లాడారు. ఎమ్మెల్యే పార్థసారథి స్పందిస్తూ... దళితులకు, సర్పంచి చంద్రశేఖర్‌కు క్షమాపణ చెప్పారు. ఈ ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని, ఇలాంటి ఘటన జరగకుండా జాగ్రత్తగా మెలుగుతామని తెలిపారు. మనస్సు గాయపడి ఉన్న దళితులకు క్షమాపణ చెబుతున్నట్లు ప్రకటించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఎమ్మెల్యే, కృష్ణమ్మపై కేసు నమోదు చేయాలి

- దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆదోని

ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి నాయకులు గుడిసె ఆది కృష్ణమ్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ మైదానం నుంచి దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆత్మగౌరవ ర్యాలీ చేపట్టారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఇస్వి పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.ఆనంద్‌బాబు మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో ఇప్పటికీ కుల వివక్షత కొనసాగడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి దురాచారాన్ని నిర్మూలించాల్సిన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ప్రోత్సహించే దిశగా వ్యవహరించడం దారుణమని విమర్శించారు. ఆదోని మండలం ఢణాపురం గ్రామంలో సర్పంచి చంద్రశేఖర్‌ను అరుగుపైకి పిలువకుండా కాళ్ల వద్ద నిలిచి ఉండాలని సంకేతాలు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, 'ఎస్సీ' అన్న టిడిపి నాయకులు గుడిసె ఆది కృష్ణమ్మపై కెవిపిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తామన్నారు. బాధితుడు సర్పంచి చంద్రశేఖర్ మాట్లాడుతూ... తన పట్ల కుల వివక్షత చూపడం సమంజసం కాదన్నారు. దేవాలయం పక్కన ఉన్న తనను ఎమ్మెల్యే రావాలని పిలవగా... అక్కడకు వెళ్లే ప్రయత్నంలోనే 'ఎస్సీ' అని టిడిపి నాయకులు గుడిసె ఆది కృష్ణమ్మ సంబోధించడం వల్ల మనస్తాపానికి గురయ్యానని వాపోయారు. తనకు పదవి ముఖ్యం కాదని, ఆత్మగౌరవం ముఖ్యమని తెలిపారు. దళిత జాతి వెంట చివరి వరకు నడుస్తానని స్పష్టం చేశారు. ఎంఐఎం ఇన్‌ఛార్జ్ జునైద్ మాట్లాడుతూ... దళితులు, ముస్లింలపై బిజెపి నైజం ఏమిటన్నది ఈ ఘటనతో స్పష్టమైందని విమర్శించారు. దళితుల ఆత్మగౌరవం కోసం నిర్వహించే ఉద్యమాలకు తమ అండ ఉంటుందని తెలిపారు. నాయకులు అజయ్ బాబు, దేవదాసు, శ్రీలక్ష్మి, మహానంది, సాయిరాం, తారక్, శంకర్ మాట్లాడుతూ... దేశంలో ఇప్పటికీ దళితులకు రక్షణ లేదని, ఆత్మగౌరవం కోసం సమైక్య ఉద్యమాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. జై భీమ్ యూత్ నాయకులు సురేష్ బాబు, నాగరాజు, ఎస్సీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సూరి, దళిత, ప్రజా సంఘాల నాయకులు మణి, సుజ్ఞానమ్మ, సంజీవ్, సిపిఎం, సిపిఐ నాయకులు ఈరన్న, లక్ష్మణ్, గోపాల్, లింగన్న, తిప్పన, వెంకటేష్, శ్రీనివాసులు, సుదర్శన్, కల్లుబావి రాజు, విజయ్, కెవిపిఎస్ నాయకులు విజయ్, తిక్కప్ప, ముని, బీఎస్పీ నాయకులు రామలింగ, వైఎస్ఆర్‌సిపి నాయకులు గంగాధర్, ఈరన్న, ఫయాజ్ అహ్మద్, తాయప్ప, అశోక్, వేణు, రామకృష్ణ, పరిగెల నారాయణ, ప్రజాసంఘాల నాయకులు నరసన్న, ప్రసాద్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్‌బాబు



ప్రదర్శన నిర్వహిస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

యోగా ఏర్పాట్లను పరిశీలించిన ప్రత్యేకాధికారి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంతర్జాతీయ యోగా డే సందర్భంగా బాలుర జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ప్రత్యేకాధికారి, డిఆర్‌డిఎ పీడీ రమణా రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం పట్టణంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో కమిషనర్ గంగిరెడ్డి, సిఐ శ్రీనివాసులుతో పరిశీలించి సమీక్షించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో యోగా డే నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. శనివారం పట్టణంలోని 237 కేంద్రాల్లో యోగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఇఒలు ఆంజనేయులు, మధుసూదన్, నోడల్ అధికారి స్వర్ణలత పాల్గొన్నారు.

కోసిగి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిపిఒ, కోసిగి మండల ప్రత్యేకాధికారి భాస్కర్ కోరారు. ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో యోగా దినోత్సవంపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... శనివారం కోసిగిలో జరిగే యోగా దినోత్సవం సందర్భంగా నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. కోసిగి పంచాయతీలో 18 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యోగా కార్యక్రమానికి గైర్హాజరయ్యే సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, ఎంఇఒ శోభా రాణి, పంచాయతీ రాజ్ ఎఇ మాలిక్ బాష, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ తిమ్మారాజు, వెలుగు ఎపిఎం సత్యమ్మ పాల్గొన్నారు.

నందవరం : యోగాంధ్ర కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంపిడిఒ పుల్లయ్య తెలిపారు. మాచాపురం సచివాలయం దగ్గర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం 31,470 మంది యోగాంధ్రలో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం మండలం మొత్తం అన్ని గ్రామాలకు సంబంధించి 108 స్థలాలను ఎంపిక చేశామని చెప్పారు. నలుగురు మాస్టర్ ట్రైనర్స్, 187 మంది టిఒటిలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీకి 15 మంది మండల అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం శనివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.



ఎమ్మిగనూరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రమణారెడ్డి



కోసిగిలో మాట్లాడుతున్న డిపిఒ భాస్కర్



నందవరంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ఘనంగా తారకనాథ్ వర్ధంతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని స్టేట్ బ్యాంకులో శుక్రవారం వై.తారకనాథ్ 21వ వర్ధంతిని నిర్వహించారు. తారక్ నాథ్ బ్యాంకు ఉద్యోగుల కోసం చేసిన సేవలను స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉద్యోగులు కొనియాడారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేద అంధులకు దుప్పట్లు, చేతికర్రలు, ఎయిడ్స్ బాధితులకు నెలసరి నిత్యావసర సరుకులు అందజేసి బ్యాంకు ఉద్యోగులు మానవత్వాన్ని చాటుకున్నారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్, కర్నూలు రీజినల్ సెక్రటరీ కె.రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.రాజశేఖర్, లోకల్ సెక్రటరీలు కె.లక్ష్మి, జి.జగన్నాథ్, ఆర్.మంజునాథ్, కె.సుజాత, సురేష్ బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - ఆదోని

న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించకుండా ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.ఆనంద్‌బాబు తెలిపారు. పట్టణంలోని భీమాస్ కూడలిలో మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు వర్కర్స్ చేపట్టిన నిరసన శుక్రవారం 17వ రోజుకు చేరింది. అంతకుముందు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు అర్ధనగ్నంగా నిలిచి నిరసన చేపట్టారు. నిరసన శిబిరానికి ఆనంద్‌బాబు, ఆది భారతీయ సేవా సంఘం అధ్యక్షులు అమల్ నాథన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడారు. రెగ్యులర్ ఉద్యోగులకు ఏమాత్రం తీసిపోని విధంగా విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు చాలీచాలని వేతనాలు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. సమాన వేతనం ఇవ్వాలని అడుగుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని విమర్శించారు. యోగాకు ఇస్తున్న ప్రాధాన్యత కార్మికుల సమస్యలకు ఇవ్వకపోవడం దారుణమని మండిపడ్డారు. సిఐటియు నాయకులు, గోపాల్, లక్ష్మణ, కెవిపిఎస్ సీనియర్ నాయకులు విజయ్ సంఘీభావం తెలిపారు, కార్మిక నాయకులు సోమన్న, కృష్ణమూర్తి, పీరా సాహెబ్, మారి, గోపాల్, కైలాస్, వీరేష్, రవి, శంకర్ మహ్మద్, కర్రెప్ప, రామాంజి, పాండు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్ బాబు

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

- ఎంఇఒ సావిత్రి

- విజయ విఠల ప్రయివేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్ర ప్రభుత్వ నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎంఇఒ సావిత్రమ్మ తెలిపారు. శుక్రవారం చిప్పగిరిలో విజయ విఠల ప్రయివేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగా జాతీయ దినోత్సవాన్ని నిర్వహించాలని తెలిపారు. మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించుకోవచ్చుని చెప్పారు. అనంతరం విజయ విఠల పాఠశాల రికార్డులను తనిఖీ చేసి, నిబంధనలు, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం టాయిలెట్స్, తాగునీరు, ప్లే గ్రౌండ్, అన్ని వసతులూ ఉండడంతో హర్షం వ్యక్తం చేశారు. కరస్పాండెంట్ చంద్రమోహన్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఒ సావిత్రమ్మ

8 గంటల పని విధానాన్ని కొనసాగించాలి

- కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, కార్మిక వ్యతిరేకి కూటమి ప్రభుత్వం నిర్ణయించిన 10 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఎమ్మిగనూరులో ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు, ఐఎఫ్‌టియు తాలూకా కార్యదర్శి ఎస్.బాలరాజు, కెకె.హనీఫ్, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు ఎం.సత్తన్న, బి.ఏసేపు, ఎఐకెఎస్ జిల్లా నాయకులు నరసయ్య మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా 8 గంటల పని విధానం కొనసాగుతోందని, దీనిని 10 గంటల విధానం తీసుకొచ్చేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విమర్శించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ పని గంటల పెంపు నిర్ణయం చేయలేదని, కేవలం చంద్రబాబు నాయకత్వాన కార్మికులకు వ్యతిరేక చట్టాలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. మహిళా సాధికారత పేరుతో ఓట్లు వేయించుకొని నేడు శ్రామిక మహిళా కార్మికులతో రాత్రి డ్యూటీలు చేయించాలని కూటమి ప్రభుత్వం మంత్రి మండలి నిర్ణయం చేయడం దారుణమని విమర్శించారు. తక్షణమే 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని, మంత్రి మండలిలో తీసుకున్న నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ప్రజాసంఘాల నాయకులు జె.నాగరాజు, కేశన్న, ప్రవీణ్, జావిద్, మునెప్ప, బి.ఏసేపు, జయన్న, రామచంద్ర, నీలకంఠ, రామన్న, మాదన్న, రాఘవేంద్ర, నాగన్న పాల్గొన్నారు. **ఆలూరులో** ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, ఎఐటియుసి మండల నాయకులు రంగన్న, నాయకులు ఈరన్న, రామాంజినేయులు, నాగరాజు, వీరేష్, రాముడు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు



ఆలూరులో ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు

మహారాజరాజశ్రీ రెండోవ సివిల్ జుడి కోర్ట్
(జూనియర్ డివిజన్) :: ఆదోని
OS. No.360/2021

Between:
శ్రీకాంతాచారి ....వాది
Vs
నిలకంటాచారి మరియు ఇంకోకరు ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

To
కే రాజమ్మ W/o కే రవిప్రసాద్, ఇంటి నెంబర్ 8,
బ్లాక్ నెంబర్ 8, రాజగృహ, పెద్దపాడు గ్రామం,
కల్లూరు మండలం, కర్నూలు జిల్లా.
... (2వ ప్రతివాది)

పై తెలిపిన వాది, ప్రతివాది అయిన మిపైన పై కోర్ట్‌లో స్థిరాస్తి విభాగాల నిమిత్తం దావా దాఖాలు చేసియున్నారు. పైకోర్ట్ నుండి ప్రతివాది అయిన నీకు కోర్ట్ ద్వారా చాల సార్లు సమన్లు పంపిననూ తీసుకోనందున కోర్ట్ వారి ఆదేశాల మేరకు ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా పై కేసు వాయిదా తేది: 25.06.2025 ఉదయం 10:30 గంటలకు ప్రతివాది అయిన నీవు కోర్ట్ ముందు హాజరు కావలెనని, నీ తరపున ఏమైనా అక్షపణలు వున్నయెడల నీవు ఖుద్దుగా గానీ, నీ వకీలు ద్వారా గాని కోర్ట్కు హాజరై మీ అభ్యంతరాలను తెలుపవచ్చును. ప్రతివాది అయిన నీవు హాజరు కాని యెడల పై కోర్ట్ వారు పై కేసులో వాది పరముగా నీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయదమైనది.

// కోర్ట్ వారి ఆర్డర్ మేరకు//

వాయిదా తేది : 25.06.2025.

శ్రీ R. రవిస్వామి
వాది తరపు అడ్వకేట్,
ఆదోని - 518301.
సెల్ : 7661946588

BEFORE THE SOLE ARBITRATOR
(ARBITRAL TRIBUNAL)
Present: Sri M. SATYANARAYANA SWAMY, B.A.,B.L.,
Sole Arbitrator
Special Judicial Magistrate (Retd),
H.No.5/178, Gowrav Residency,
Alamur Road, Rudrampet,
Anantapuramu-515 004.
I.A No. 68/2025 ARBITRATION APPLICATION No. 02/2025

Between :-
Sree Bhavani Finance, by its Prop.
A.Venkateswara Reddy, S/o A.Ramanjula Reddy,
aged about: 59 years, Hindu, Business, residing at
D.No. 18/156, Upstairs, Satta Bazar, Adoni,
Kurnool District. ...Claimant
AND
Golla Chinna Narasanna, S/o Golla Pedda Narasanna,
D.No.17/386/450a, Bhaskar Reddy Colony,
Near Kasthuri Bal Hostel, Kallubhavi,
Adoni-Town, Kurnool-District. ...Respondent/s.

INTERIM ATTACHMENT NOTICE TO RESPONDENT

To,
Golla Chinna Narasanna, S/o Golla Pedda Narasanna,
R/o D.No.17/386/450a, Bhaskar Reddy Colony,
Near Kasthuri Bai Hostel, Kallubhavi, Adoni-Town,
Kurnool-District.

ప్రతివాది అయిన నీకు 06-05-2025 తేదీన అనంతపురము ఆర్బిట్రేషన్ కోర్టు నుండి U/s.17 of A & C Act ప్రకారము నోటీసు పంపడమైనది. సదరు నోటీసు ప్రదివాది అయిన నీవు (శ్రీ గొల్ల చిన్న నరసన్న) తిరస్కరించినావు, తదుపరి 21-05-2025 తేదిన U/s 17 of A & C Act ప్రకారము Interim Attachment Order Security ఇవ్వడము నిమిత్తం పంపడమైనది. సదరు ఆర్డరు కవరు Addressee Not Located అని వాపసు వచ్చినది. అందువలన నీ హాజరు నిమిత్తము మరియు సెక్యూర్టి ఇవ్వడము నిమిత్తము 05-07-2025 తేదీన మీరు స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్నచో తెలియజేసుకోవచ్చునని, లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

SCHEDULE OF IMMOVABLE PROPERTY
THIS PROPERTY BELONGS TO RESPONDENT GOLLA CHINNA NARASANNA

Item No.1 :-
Property Situated Dist. Registration of Kurnool, Sub-Registration of Adoni, within the Dibbanakallu Grama panchayath, Dibbanakallu Village Sy.No.142 Ac.5.41cents within the following particulars :
Document No. : 4709/2023,
Survey No. : 142 Dibbanakallu (V)
Extent : Ac.5.41cents
BOUNDARIES :
East : Land Of Chinna Ranganna,
West : Lands of H. Hussainappa, Bajarappa, Ganganna, Veeresh
North : Land of Narasamma including Rastha
South : Lands of K. Jayaramudu, K. Ravi, K. Basavaraj, K. Chinna Ranganna
Property Value : **Rs.21,64,000-00**

Item No.2 :-
Property Situated Dist. Registration of Kurnool, Sub Registration of Adoni, with in the Dibbanakallu Grama panchayath, Dibbanakallu Village Sy.No.143 Ac.1.00Cents within the following particulars :
Document No. : 4709/2023,
Survey No. : 143 Dibbanakallu (V)
Extent : Ac.1.00cents
BOUNDARIES :
East : Land Of Chinna Ranganna
West : Land of K. Nagarjuna
North : Sy.No.142 Land (Chinna Narasanna)
South : Lands of Kapati Eranna, Kapati Nagendra and Vanka
Property Value : **Rs.4,00,000-00**

Item No.3 :-
Property Situated Dist Registration of Kurnool, Sub Registrar Adoni, with in the Dibbanakallu Grama panchayath, Dibbanakallu Sy.No.140B Subdivision Sy.No.140B1 Ac.0.17Cents within the following particulars :
Document No. : 4709/2023,
Survey No. 140B Dibbanakallu (V)
140B1 (Sub Division)
Extent : Ac 0.17 Cents
BOUNDARIES :
East : Land Of Chinna Ranganna,
West : Land of Narasamma
North : Aspari Road
South : Sy.No.142 Land
Property Value : **Rs.68,000-00**

// By Order of Tribunal //

Sri K. HUSSAIN NIZAMI
Advocate,
Anantapuramu.

ప్రజల సేవలో రెవెన్యూ శాఖ

- తహశీల్దార్ శ్రీనివాసులు - ఘనంగా రెవెన్యూడే సంబరాలు

ప్రజాశక్తి - నందవరం

ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ శాఖ సేవలు అందిస్తోందని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 'రెవెన్యూ డే' సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1786 రెవెన్యూ బోర్డును ఏర్పాటు చేశారని, ఇప్పటివరకు ప్రజలకు అనుకూలంగా అనేక సంస్కరణలు చేస్తూ రెవెన్యూ శాఖ సేవలందిస్తోందని తెలిపారు. ప్రకృతి విపత్తు సమయంలో ప్రజలకు సేవలు అందించడంలో రెవెన్యూ శాఖ పాత్ర కీలకమైందని చెప్పారు. జననం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఇన్కమ్, క్యాస్ట్, ఓటర్ కార్డు, మరణం సర్టిఫికెట్ వరకు అనేక సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల రెవెన్యూ సమస్యలు పరిష్కరించి వారి భూమిపై వారికి హక్కు వచ్చేలా న్యాయం చేస్తున్నామన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత మండలంలో సుమారు 200 రెవెన్యూ సమస్యలు తన దృష్టికి వచ్చాయని, అందులో 50 సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. త్వరలోనే మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. డిప్యూటీ తహశీల్దార్ శశిధర్, డిటి మహేష్, ఆర్ఐ సుబ్బారెడ్డి, విఆర్ఒ రామేశ్వరమ్మ, సర్వేయర్ అక్బర్ బాషా, చాంద్, మోదీన్ పాల్గొన్నారు. **చిప్పగిరి** తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ కార్యదర్శి గోవిందప్ప ఆధ్వర్యంలో రెవెన్యూడే నిర్వహించారు. తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్‌ను, కళాశాల ప్రిన్సిపల్ వరదరాజులు, ప్రజా ప్రతినిధులను, ప్రజలను, రైతులను, పాత్రికేయులను పూలమాల, శాలువాతో రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. అందరూ కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఉత్తమ ప్రశంసాపత్రాలు అందుకున్న రెవెన్యూ కార్యదర్శి మీనా, విలేజ్ సర్వేయర్ వినోద్ కుమార్, ఆపరేటర్ రఘు, విఆర్ఎ రమేష్‌ను పూలమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం టిడిపి నాయకులు, ఎంపిటిసి రజిని మాట్లాడారు. తహశీల్దార్ కార్యాలయంలో పనుల నిమిత్తం వచ్చిన రైతులందరికీ ఉత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సేవలను రెవెన్యూ అధికారులంతా ప్రజల దగ్గరకు తీసుకెళ్లడం ఆనందదాయకమన్నారు. జనసేన మండల కన్వీనర్ చిరంజీవి, టిడిపి నాయకులు కరివేముల గోవిందు, ఆర్ఐ సునీత, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, జూనియర్ అసిస్టెంట్ వీరేష్, లెక్చరర్ సుబ్రమణ్యం, ఎఎస్ఒ నితిన్, రెవెన్యూ కార్యదర్శులు పెద్దన్న, వన్నూరు, ఆంజనేయులు, చంద్ర నాయక్, రవళి, మీనా, రవి పాల్గొన్నారు. **ఆస్పరి**లోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ డేను తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని రెవెన్యూ అధికారులు అందించిన సేవలను గుర్తించి తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి, జొహరాపురం విఆర్ఒ హరికృష్ణ, విలేజ్ సర్వేయర్ సావిత్రి, ఆపరేటర్ హరిబాబు, తలారి నౌనేపాటికి మండల ఉత్తమ సేవాపత్రాన్ని పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్ చేతుల మీదుగా అందజేసినట్లు తెలిపారు. ముందుగా విశ్రాంత ఆర్ఐ ఫక్రుద్దీన్, విశ్రాంత అగ్రికల్చర్ అధికారి మాణిక్ రెడ్డిని శాలువా, పూలమాలలతో సన్మానించారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్, ఆర్ఐ రంగస్వామి, జూనియర్ అసిస్టెంట్ నబి రసూల్, ఎఎస్ఒ రామాంజనేయులు, కెడిసిసి బ్యాంకు మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర పాల్గొన్నారు. **హాలహర్వి** తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూడే నిర్వహించారు. తహశీల్దార్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. డిప్యూటీ తహశీల్దార్ బ్రహ్మయ్య పాల్గొన్నారు. **దేవనకొండ**లో రెవెన్యూ శాఖ ఉద్యోగులు బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, సంబరాలు జరుపుకొన్నారు. రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ అవినాబేగం, విఆర్ఒ రాజన్న, గ్రామ సహాయకులు ఆంజనేయలును పూలమాల, శాలువాతో తహశీల్దార్ రామాంజనేయులు సన్మానించారు. డిప్యూటీ తహశీల్దార్ శశికళ, మల్లికార్జున, రవికుమార్, ఆర్ఐ విజయభాస్కర్, విఆర్ఒ గ్రేడ్-2 అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆనంద్ కుమార్, రెవెన్యూ అసోసియేషన్ మండల అధ్యక్షులు దాదావలీ పాల్గొన్నారు. **కౌతాళం** తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే నిర్వహించారు. విఆర్ఒలు ఉప్పలప్ప, హనుమంతురావు (అమ్మనప్ప స్వామి), వెంకటేష్‌కు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. తహశీల్దార్ రజినీకాంత్ రెడ్డి, సూపరింటెండెంట్ రామయ్య, ఆర్ఐ లక్ష్మన్న పాల్గొన్నారు.



ఆస్పరి



దేవనకొండ



కౌతాళం



నందవరంలో మాట్లాడుతున్న అధికారులు



చిప్పగిరిలో తహశీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది



హాలహర్వి

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆస్పరి

అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు మండల నాయకులు బాలకృష్ణ, రంగస్వామి, యూనియన్ మండల కార్యదర్శి విశ్వ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటల పని విధానాన్ని అమలు చేయడం సమాజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన 12 గంటల పని విధానాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆశా, అంగన్వాడీ, ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు రాధా, సావిత్రి, నాగేంద్రమ్మ, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శులు రవి, తరుణ్, వ్యకాస నాయకులు నాగరాజు పాల్గొన్నారు. **మంత్రాలయం**లోని ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ రాజేశ్వరి దేవికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ మండల కార్యదర్శి భీమేశ్వరి మాట్లాడుతూ... అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ఈనెల 23న కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు తెలిపారు. సిఐటియు నాయకులు టి.ప్రాణేష్, అంగన్వాడీలు కల్యాణి, శ్వేత, స్వప్న పాల్గొన్నారు.



ఆస్పరిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



మంత్రాలయంలో

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని ఎండి.హళ్లి మండల పరిషత్ పాఠశాలలో సర్పంచి సుధాకర్ అధ్యక్షతన పాఠశాల ఉపాధ్యాయులు సిద్ధన ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు బ్యాగులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. తెలుగు యువత మండల నాయకులు కురువ నాగరాజు, పాఠశాల కమిటీ వైస్ ఛైర్మన్ హరిజన సునీతమ్మ, టిడిపి యువ నాయకులు హరిజన దాసప్ప పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కుర్ని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో భూసమస్యలు, సిఎంఆర్ఎఫ్ దరఖాస్తులు, రోడ్లు, రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, పట్టాలు, ఇళ్లు, విద్యుత్ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. **మంత్రాలయం** మండలం మాధవరం గ్రామంలోని స్వగృహంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను అధికారుల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ఎమ్మిగనూరులో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే



మంత్రాలయం: వినతులు స్వీకరిస్తున్న రాఘవేంద్రరెడ్డి

మెరుగైన సేవలు ఎపిజిబి లక్ష్యం

- కర్నూలు రీజినల్ మేనేజర్ నవీన్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

ఖాతాదారులకు మరిన్నీ మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు కర్నూలు రీజినల్ మేనేజర్ నవీన్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆదోని బ్రాంచిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుగా సేవలందించామని, మే 1, 2025 నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మరిన్నీ మెరుగైన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇంటి రుణాలపై రూ.50 లక్షల నుంచి ప్రస్తుతం రూ.75 లక్షలు రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. వాహన రుణాలు గతంలో రూ.15 లక్షలకే పరిమితి ఉండేదని, ప్రస్తుతం అపరిమితంగా తక్కువ వడ్డీతో అందజేస్తామని చెప్పారు. ఖాతాదారుల డిపాజిట్లపై కూడా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అన్ని బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీని ఖాతాదారులకు అందజేస్తోందని పేర్కొన్నారు. రైతు పొలాలపై సాధారణ రుణాలు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పొందే అవకాశం ఉందన్నారు. విద్యపైనా, చిరు వ్యాపారాలపైనా తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తామని వివరించారు. అనంతరం బ్యాంకు సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ నరేష్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

విద్యుత్ శాఖలో యోగాంధ్ర కార్యక్రమం

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఎపిఎస్‌పిడిసిఎల్ విద్యుత్ భవనంలో శుక్రవారం కర్నూలు జిల్లా ఎస్ఇ కార్యాలయ ఆవరణలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సన్నద్ధంలో భాగంగా ప్రముఖ యోగా గురువు పెరుమాళ్ల సత్తయ్య ఆధ్వర్యంలో కర్నూలు విద్యుత్ ఉద్యోగులందరితో యోగ అభ్యాసనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ ఉమాపతి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచన మేరకు యావత్ భారతదేశం అలాగే ప్రపంచం మొత్తం ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం గా జరుపుకుంటున్నామన్నారు. ఈ సంవత్సరం 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవంలో భాగంగా ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మే21 నుంచి ఈనెల 21 వరకు యోగానెలగా యోగాంధ్ర కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ఈ యోగా విశిష్టతను తెలుపుతూ యోగా కేవలం శారీరక వ్యాయామం కంటే ఎక్కువ అని అలాగే క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల శరీరం, మనసు ఆత్మకు గొప్ప ప్రయోజనాలు లభిస్తాయని తెలిపారు. ఈ యోగా వల్ల వ్యక్తిగత జీవితం ఆరోగ్యంతో ప్రశాంతతో జీవనశైలి మెరుగుపరడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. అందరూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొని కార్యక్రమంలో జయప్రదం చేయాలని తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో పి.ఓబులేసు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్, మహేశ్వర్‌రెడ్డి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కన్‌స్ట్రక్షన్ బి.లత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎంఆర్‌టి టి. శేషాద్రి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కర్నూలు టౌన్ డివిజన్ , ఉద్యోగస్తులందరూ పాల్గొన్నారు.





టిఎండి హుస్సేన్‌ను సన్మానిస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

మంచి గుర్తింపు తెచ్చుకోవాలి

ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి-పత్తికొండ

ంవిన్యూ శాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగి ప్రజల నుండి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆర్‌డిఒ భరత నాయక్ తెలిపారు. శుక్రవారం పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయంలో 9 మండలాల తహశీల్దార్లు, ఆర్‌డిఒ భరత్ నాయక్ ఆధ్వర్యంలో రెవిన్యూ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సేవలను అందజేయాలని తెలిపారు. ఆర్‌డిఒ భరత్ నాయక్ రిటైర్డ్ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు టిఎండి హుస్సేన్‌కు శాలువా వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ తహశీల్దార్ హుస్సేన్ సాహెబ్, రెవెన్యూ అధికారులు రవి, సుదర్శన్ ,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యు లో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో నాలుగు రోజులపాటు నిర్వహించిన యోగాంధ్ర వర్క్‌షాపు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు అధ్యాపకులు ప్రతిరోజు యోగా సాధన చేయాలని కోరారు. నంద్యాలకు చెందిన రాపర్తి రామా అకాడమీ ఆఫ్ యోగిక్‌సైన్సెస్ సంయుక్త భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులను వైస్ ఛాన్సలర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టికె. నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి. విజయకుమార్ నాయుడు, వర్సిటీ కాలేజీ ప్రిన్సిపల్ ఆచార్య సివి. క్రిష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఎన్.నరసింహులు, సిడిసి , ఎగ్జామినేషన్స్ డీన్ ఆచార్య పివి. సుందరానంద్, రీసర్చ్ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య ఆర్. భరత్ కుమార్, వర్క్‌షాపు కోఆర్డినేటర్ డాక్టర్ బి.కవిత పాల్గొన్నారు.



యోగా శిక్షకులను అభినందిస్తున్న విసి వెంకటబసవ రావు, ప్రొపెషర్లు

జీవితంలో యోగా భాగం కావాలి

దైనందిన జీవితంలో యోగా భాగం కావాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. లోకనాథ అన్నారు. శుక్రవారం ఉర్దూ యూనివర్శిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యోగాంధ్రా కార్యక్రమం పై విద్యార్థులచే యోగా పై అవగాహణ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని రిజిస్ట్రార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మహబూబ్ బాషా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.పాల్ కృపాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్-ఎస్ఎం. హుస్సేని, బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉర్దూ యూనివర్సిటీలో యోగాంధ్ర కార్యక్రమంలో రిజిస్టర్ లోకనాథ

యోగా సాధనతో మానసిక ప్రశాంతత

క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు

రోజు ఎన్ని పనులు ఉన్నా కొంత సమయం యోగా సాధనకు కేటాయించడం ద్వారా మానసిక ప్రశాంతత ఏర్పడి, మనిషి దైనందిన జీవితంలో మార్పు వస్తుందని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాస్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి, కెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి, డాక్టర్ జి రంగారెడ్డి, డాక్టర్ హేమంత్, డాక్టర్ సత్యనారాయణ, పాల్గొన్నారు.



పత్తికొండ కెజిబివిలో తనిఖీ చేస్తున్న జిసిడిఒ మేరీ స్వర్ణలత

కెజిబివి ఆకస్మిక తనిఖీ చేసిన జిసిడిఒ

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంను(కెజిబివి) జిసిడిఒ మేరీ స్వర్ణలత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ , బియ్యం నిల్వ, మిగులు ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలు హెల్త్ చెకప్ అంశాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చదువుకుంటే జీవితంలో ఎవరిమీద ఆధారపడకుండా జీవించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకురావాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ షబానా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

23న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అంగన్వాడి లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎఫ్ఆర్ఎస్ ను రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ కోరారు. శుక్రవారం ఐసిడిఎస్ పిడికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ జిల్లా నాయకులు గోవర్ధనమ్మ, జ్యోతి,లు కలిసి వినతి పత్రం అందజేశారు. స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాల అమలు చేయకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. తల్లికి వందనం , వృద్ధులకు పెన్షన్లు ఇతర సంక్షేమ పథకాలు రావడం లేదన్నారు. అంగన్వాడీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని వేతనాలు పెంచాలని అనేక రకాలుగా ఆందోళన చేసినప్పటికీ వేతనాలు పెంచడం లేదన్నారు . ఈనెల 23న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్లను వారు కోరారు

యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు , నగర కార్యదర్శి బీసన్న మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇస్తామన్నా నిరుద్యోగ భృతిని కూడా వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు

ఆలూరు ఒబిసి సెల్ చైర్మన్ నియామకం

కర్నూలు కలెక్టర్ : ఆలూరు మండల ఒబిసి సెల్ చైర్మన్ గా హజరత్ వలి , ఆస్పరి మండల ఒబిసి సెల్ చైర్మన్ గా ఖాదర్‌ను నియమించారు. జిల్లా ఒబిసి సెల్ చైర్మన్ డివి సాంబశివుడు , హజరత్ వలీ, ఖాదర్‌లను మండల ఒబిసి సెల్ చైర్మన్ లుగా నియమించారు. వారికి మాజీ ఎమ్మెల్సీ, ఎఐసిసి మెంబర్ ఎం.సుధాకర్ బాబు , మాజీ డిసిసి అధ్యక్షులు కె.బాబురావు, జిల్లా చైర్మన్ సాంబశివుడు వారికి పార్టీ కండువాలు వేసి నియామక పత్రాలు అందజేశారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేయాలి

కర్నూలు కలెక్టరేట్ :యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్న నేపథ్యంలో శనివారం ఉదయం విద్యార్థులందరికీ అల్పాహారం అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్‌పాల్, డిప్యూటీ ఎంఇఒలకు ఆదేశాలను జారీ చేశారు. యోగా కార్యక్రమం పూర్తయిన వెంటనే విద్యార్థులకు ఉప్మా, చట్నీతో కూడిన అల్పాహారం అందజేయాలన్నారు.

హోండా షైన్ బైక్ అపహరణ

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ కు చెందిన గౌండ కూలి గుండ్రేవులలో గౌండ పని చేస్తుండగా హోండా షైన్ బైక్ మాయమైంది. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకోగా సిబెళగల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదయ్యింది. గౌండ పవన్ కళ్యాణ్ గుండ్రేవులలో ఇస్మాయిల్ ఇంటికి పనికి వెళ్ళాడు. ఆరుబయట ఎపి 39 హెచ్ ఎం 8248 గల బైకు ను స్టాండ్ చేసి రోజు లాగే పనిలో నిమగ్నమయ్యాడు. మధ్యాహ్నం భోజనం వేళ బయటకు వచ్చి చూస్తే బైకు కనిపించలేదు. పలువురిని విచారించినా ఆచూకీ తెలియక అయోమయంలో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. తగు దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఏడుగురు పేకాట రాయుళ్ళు అరెస్టు

మోడల్ స్కూల్ సమీపంలో శుక్రవారం పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు ఆచారి, సుదర్శనం పట్టుకొని అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రెండు బైకులు, రూ 3654 లను స్వాధీనం చేసుకొన్నారు.

ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ యూనియన్ పిలుపుమేరకు వర్ధంతి సందర్భంగా, స్టేట్ బ్యాంకు 70 సంవత్సరాల వేడుకను పురస్కరించుకొని శుక్రవారం నంద్యాల శ్రీనివాస సెంటర్లోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ ఆవరణంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ సూర్య ప్రకాష్, హెచ్‌ఆర్ మేనేజర్ కేశవ గౌడ్, బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రాఘవ యాదవ్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల ముఖ్య అతిథులుగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రా రంభించారు. ఎస్‌బిఐ ఉద్యోగులు, అధికారులు, కస్టమర్లు దాదాపు 70 మందికి పైగా రక్త దానం చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా కార్య వర్గ సభ్యులు ఉస్మాన్‌బాష, మద్దిలేటి, కోశాధికారి నాగేశ్వరరావు, డాక్టర్ సహదేవుడు, కర్నూల్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

